క్లుప్తంగా

మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడిగా తిరుపతిరావు



తెర్లాం: మండల వీఆర్వోల సంఘం నూతన అధ్యక్షుడిగా ముచ్చి తిరుపతిరావు ఎన్నికయ్యారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద వీఆర్వోల నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం నిర్వహించారు. కార్యదర్శిగా లింగాల గణపతి, ఉపాధ్యక్షునిగా కిల్లాడ సుధాకర్, కోశాధికారిగా దుమ్మిద రాము ఎన్నిక కాగా వీఆర్వోల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని, సంఘ అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.

దుస్తుల వితరణ



గిరిజనులకు దుస్తులు అందజేస్తున్న కృష్ణదాస్, శర్మ

బొబ్బిలిరూరల్: మండలంలోని గోపాలరాయుడుపేట పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాల్లో ఉన్న పలువురు నిరుపేదలకు ఆదివారం దుస్తులు వితరణ చేశారు. వనమిత్ర కృష్ణదాస్, మాజీ సైనిక సంక్షేమ సంఘం ప్రతినిధి శర్మలు సమకూర్చిన వీటిని నిరుపేదలైన గిరిజనులకు అందజేశారు. పేదలను ఆదుకునేందుకు మరింతమంది మానవతా దృక్పథంతో ముందుకురావాలని వారు కోరారు.

నేడు సైకిళ్ల పంపిణీ



బాడంగిలో పంపిణీకి సిద్ధం చేసిన సైకిళ్లు

బాడంగి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం సైకిళ్ల పంపిణీ చేయనున్నట్లు ఆ పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. అమెరికాకు చెందిన యూనివర్సల్ ఫ్యామిలీ వారు చేసిన రూ.6 లక్షల ఆర్థికసాయంతో కొనుగోలు చేసిన 100 సైకిళ్లను ఎమ్మెల్యే బేబీనాయన చేతులమీదుగా అందివ్వనున్నామన్నారు. బొబ్బిలి, గజపతినగరం, సాలూరు తదితర ప్రాంతాలకు చెందిన నిరుపేద, అనాథ విద్యార్థులకు వీటిని అందజేస్తున్నామన్నారు. దూరప్రాంతాల నుంచి వస్తున్న విద్యార్థులకు కల్పిస్తున్న ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అవయవ దానానికి ముందుకురావాలి



అవయవదాన పత్రాలు అందజేస్తున్న మాధవరావు

బొబ్బిలి: ప్రతిఒక్కరూ అవయవ దానానికి ముందుకురావాలని స్థానిక పట్టణానికి చెందిన అభిమాని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రెడ్డి రాజగోపాలనాయుడు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఫౌండేషన్ కార్యాలయానికి మాధవరావు తదితర యువకులు ఆదివారం వెళ్లి, తమ అవయవ దానానికి సంబంధించిన పత్రాలను రాజగోపాలనాయుడుకు ఆదివారం అందజేశారు. అనంతరం వారిని ఆయన అభినందిస్తూ అవయవ దాతలను ఆదర్శంగా తీసుకుని, మరింతమంది దానానికి ముందడుగు వేయాలని కోరారు. మనం దానం చేసే అవయవాల ద్వారా మరింతమంది వ్యక్తుల జీవితాల్లో వెలుగులు నిండుకుంటాయన్న విషయం మర్చిపోవద్దన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు ఆలోచన మానుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు లక్షుంనాయుడు

బొబ్బిలి: విద్యుత్ చార్జీల పెంపు ఆలోచనను మానుకోవాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్షుంనాయుడు ప్రభుత్వాన్ని కోరారు. ఇదే విషయమై ఆయన విలేకరులతో ఆదివారం మాట్లాడుతూ ఎన్నికల ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నిన్నమొన్నటి వరకు నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెంచి, ఇప్పుడు కరెంట్ చార్జీలు పెంచడం సరికాదన్నారు. పెరిగిన ధరలతో సామాన్యుడి బతుకు భారమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీలకు సంబంధించి, రాష్ట్ర వ్యాప్తంగా రూ.6 వేల కోట్ల అదనపు బాదుడుకు కూటమి సర్కారు రంగం సిద్ధం చేయడం దురదృష్టకరమన్నారు. విద్యుత్ చార్జీలు పెంచితే ఆందోళన చేస్తామన్నారు.

29న నవదుర్గమ్మ హుండీల ఆదాయం లెక్కింపు

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గమ్మ ఆలయ హుండీల్లోని ఆదాయాన్ని ఈ నెల 29వ తేదీన లెక్కించనున్నామని ఆలయ ఈవో పి.శ్యామలరావు ఆదివారం తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి సమక్షంలో హుండీలు తెరిచి, అందులో భక్తులు వేసిన కానుకలను లెక్కించనున్నామన్నారు.

కార్తీకం..శుభకరం!

- నవంబరు 2 నుంచి కార్తీకమాసం ఆరంభం
- నాలుగు వారాల పాటు ప్రత్యేక వ్రతాలు, నోములు
- దీపాన్ని దైవస్వరూపంగా భావించి, పూజలు
- సకల శుభాలు కలుగుతాయన్నది భక్తుల విశ్వాసం
- ముస్తాబవుతున్న ఆలయాలు



కార్తీకమాస పూజలకు ముస్తాబు చేస్తున్న నరసాపురం శివాలయం, (ఇన్‌సెట్‌లో) రామభద్రపురం శివాలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు

రామభద్రపురం: హిందువులంతా కార్తీకమాసంలోని నెల రోజులను అత్యంత పవిత్రమైన రోజులుగా భావిస్తారు. ఈ నెల రోజులూ దైవభక్తిలో ఉంటే ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు కలుగుతాయన్నది భక్తుల ప్రగాఢ విశ్వాసం. అన్ని మాసాల్లో కన్నా కార్తీకమాసం పవిత్రమైనదిగా వేదపండితులు పేర్కొంటారు. ఈ మాసంలో మహిళలు ప్రత్యేకంగా వ్రతాలు, నోములు ఆచరిస్తారు. ఇదిలా ఉంటే ఈ మాసంలో దీపారాధనకు ఎంతో ప్రాధాన్యం ఉంది. దీపారాధన అనేక శుభఫలితాలు కలుగజేయడమే కాకుండా అంతులేని ఆరోగ్యభాగ్యాలను ఇస్తుందని భక్తులు విశ్వసిస్తారు. దీపాన్ని దైవ స్వరూపంగా భావించి, పూజలు చేస్తారు. దేవుడికి దీపాన్ని వెలిగించడంలో మన పూర్వీకులు వేదాంత విషయాన్ని స్పష్టంగా తెలిపారు. అంతటి విశిష్టత కలిగిన దీపారాధన కార్తీకమాసంలో ప్రత్యేకంగా చేస్తారు. కార్తీక సోమవారాల్లో చేసే దీపారాధన, ఉసిరి చెట్టు కింద పూజలు, వనభోజనాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని పండితులు చెబుతున్నారు. నవంబరు 2వ తేదీ నుంచి ప్రారంభమయ్యే కార్తీకమాసంలోని నాలుగు వారాల పాటు ఈ పూజలు కొనసాగున్నాయి. ఈ నేపథ్యంలో అంతటా ఉన్న ఆలయాలు ముస్తాబవుతున్నాయి. విద్యుత్ దీపాలంకరణలు చేయడంతో పాటు కొత్తగా రంగులద్ది సరికొత్తగా తయారు చేస్తున్నారు.

దీపారాధన ప్రత్యేకత..

కార్తీకమాసంలో ఒక్కో రకమైన ప్రమిదలో దీపం వెలిగిస్తే ఒక్కో రకమైన మంచి జరుగుతుందని శాస్త్రాల్లో పేర్కొన్నారు. మట్టి ప్రమిదలో వెలిగిస్తే దైవానుగ్రహం కలుగుతుందని, పింగాణి ప్రమిదలో దీపం వెలిగిస్తే ఆ ఇంటి వారికి అలంకరణ వస్తువులు సమకూరుతాయని, ఇత్తడి ప్రమిదలో దీపాలు వెలిగిస్తే ఆ ఇంట్లో దైవశక్తి అధికమవుతుందని, కంచు ప్రమిదలో వెలిగిస్తే ఆయుష్షు పెరుగుతుందని, నిమ్మ ప్రమిదల్లో వెలిగిస్తే అన్ని కార్యాల్లోనూ విజయం సిద్ధిస్తుందని, అరటి దొన్నెలో దీపం వెలిగించి నీటిలో వదిలితే మానసిక సంతృప్తి, ధన రక్షణ కలుగుతుందని, ఉసిరికాయల దీపం వెలిగిస్తే పాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం.

శివకేశవులకు సమప్రాధాన్యం..

కార్తీకమాసం శివుడికి, విష్ణువుకి ప్రీతికరమైనది. అందుకే ఈ మాసంలో ప్రతీ సోమవారం శివుడికి, ప్రతీ శుక్ర, శనివారాల్లో విష్ణుమూర్తికి ప్రత్యేక పూజలు చేస్తారు. శివపార్వతుల పుత్రుడైన అయ్యప్ప దీక్షలు ఈ మాసంలోనే ప్రారంభమవుతాయి. శివుడికి రుద్రాభిషేకం, బిల్వార్చనలు, విష్ణువుకి తులసీదళార్చనలు ఈ మాసంలోనే అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. లక్ష్మీదేవి, కార్తికేయుడు, చంద్రుడు, ఇంద్రుడు, తులసీమాత, ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేయడం కూడా ఆనవాయితీగా వస్తోంది.

సంపూర్ణ ఆరోగ్యం..



కార్తీకమాసం చాలా పవిత్రమైన మాసం. ఈ నెల రోజుల పాటు దీపారాధన చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయి. దీపారాధన ద్వారా ప్రశాంతత చేకూరుతుంది. హారతి వల్ల మన ప్రార్థనలు దేవుడికి నేరుగా చేరుతాయి. అంతే కాకుండా సిరిసంపదలతో పాటు అంతులేని ఆరోగ్యం ప్రసాదించబడుతుంది.

–అక్కిన వరలక్ష్మి, రామభద్రపురం

మానసిక ప్రశాంతత చేకూరుతుంది..



నెలరోజుల పాటు ఆలయాల్లో దీపారాధన చేయడం వల్ల మనసుకు ప్రశాంతత లభిస్తుంది. కుటుంబంలో సుఖశాంతులు లభిస్తాయి. అందరం కలసి సామూహికంగా భగవంతుడిని కొలవడం ఆనందాన్ని, మానసిక ప్రశాంతత కలుగుతుంది.

–కోట సత్తెమ్మ, రామభద్రపురం

దీపాలు వెలిగిస్తే దోష నివారణ..



కార్తీకపౌర్ణమి రోజు దీపాలు వెలిగిస్తే అన్ని రకాల దోషాలు తొలగిపోతాయి. పరమేశ్వరునికి 11 దీపాలు, కాలసర్పదోషానికి 212, మాంగళ్య దోషానికి 21, శని దోషానికి 9, గురు దోషానికి 33, కత్ర దోషానికి 108, దుర్గాదేవికి 9, పుత్ర దోషానికి 51, సర్ప దోషానికి 48, రాహు దోషానికి 21 దీపాలు వెలిగిస్తే మంచి ఫలితాలు లభిస్తాయి.

–డబ్ల్యూఎస్ రాయులు శర్మ, రామభద్రపురం

స్టాక్ వివరాలివ్వండి

సాక్షి ఎఫెక్ట్

రాజాం: పట్టణ పరిధిలో నిర్వహిస్తున్న బాణసంచా షాపుల యజమానులకు స్థానిక రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. దుకాణంలోని మందుగుండు సామగ్రి స్టాక్ వివరాలు ఇవ్వాలని నోటీసుల్లో కోరారు. బాణసంచా అక్రమ తరలింపు, విక్రయాలపై ఈ నెల 27వ తేదీన సాక్షి దినపత్రికలో 'దాచేసి.. దోచేస్తున్నారు!' శీర్షికన వార్తా కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు ఆదివారం ఆర్ఐ విద్యాసాగర్‌తో పాటు వీఆర్‌వోలను మందుగుండు సామగ్రి విక్రయ దుకాణాలకు పంపించి, వివరాలు సేకరించేలా చర్యలు తీసుకున్నారు. నిబంధనలు పాటించాలని, బాణసంచా విక్రయాలకు అనుమతులు తీసుకోవాలని, అధిక ధరలకు విక్రయించినా అక్రమంగా తరలించినా, అమ్మినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పంచాయతీల తీర్మానం ఉన్న పనులకే నిధులు ఇవ్వాలి



రాజాం: ఎంపీడీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్‌లు

రాజాం: గ్రామసభల్లో పంచాయతీ తీర్మానం జరిగి, సర్పంచ్‌లు, వార్డు సభ్యుల ఆమోదం తెలిపిన పనులకు మాత్రమే నిధులు విడుదల చేయాలని పలువురు సర్పంచ్‌లు కోరుతున్నారు. ఇదే విషయమై మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు ఎంపీపీ లావేటి సులోచన, జెడ్పీటీసీ బండి నర్సింహులుతో కలిసి మండల కేంద్రంలో ఎంపీడీవో వి.శ్రీనివాసరావును ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. సప్లయింగ్ పేరిట వెండర్‌లకు పనులు కల్పించి, నిధులు విడుదల చేస్తే న్యాయపోరాటానికి దిగుతామని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు మట్లాడుతూ గ్రామాల్లో సర్పంచ్‌లదే పూర్తి అధికారమన్నారు. గత ప్రభుత్వం సర్పంచ్‌లకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చిందని, ప్రస్తుతం సర్పంచ్‌లు ఆమోదించిన పనులు పక్కనబెట్టి, టీడీపీ కార్యకర్తలు ప్రతిపాదించిన పనులను అధికారులు ఆమోదించడం దారుణమన్నారు. పంచాయతీల బలోపేతం నిమిత్తం కేంద్రం ఇచ్చిన నిధుల్లో సర్పంచ్‌లను కాదని, టీడీపీ కార్యకర్తలకు పెద్దరికం ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమని ఖండించారు. సర్పంచ్‌లకు సర్వాధికారాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు యాలాల వెంకటేష్, నక్క వర్షిణి, సర్పంచ్‌లు వాకముల్ల చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: ఉపాధి హామీ పథకం అభివృద్ధి పనులకు సంబంధించి, పంచాయతీలు తీర్మానం చేసిన పనులకే ప్రాధాన్యమివ్వాలని సర్పంచ్‌ల ప్రతినిధులు వాసిరెడ్డి శంకరరావు, బేతనపల్లి శంకరరావు, రెడ్డి కృష్ణ, రావాడ తిరుపతి, ఉడమల అప్పలనాయుడు కోరారు. కూటమి ప్రభుత్వం పంచాయతీల అధికారాలను కాలరాస్తోందని, సర్పంచ్‌లను కాదని వెండర్స్ పేరుతో కాంట్రాక్టర్లను తెరమీదికి తీసుకురావడాన్ని తామంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



బాడంగి శాఖా గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

తెర్లాం: ప్రతీ విద్యార్థి ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా విద్యార్థులకు ఎంతో మేలు అని, ప్రతిరోజూ పుస్తకాలు చదవడం ద్వారా అపారమైన జ్ఞానం అలవడుతుందన్నారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు వార్తాపత్రికలు, వార, మాసపత్రికలు, పోటీ పరీక్షల పుస్తకాలు, ఇతిహాస గ్రంథాలు చదవాలన్నారు. చిల్డ్రన్స్ క్లబ్‌లో ప్రతీ విద్యార్థి చేరాలన్నారు.

బాడంగి: స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించి, విద్యార్థులతో పుస్తకాలు చదివించారు. అనంతరం పుస్తకాలు చదవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యజీవన సత్సంగ సమావేశం

రేగిడి: మండలంలోని దేవుదళ గీతాశ్రమంలో గొర్లె దామోదరరావు ఆధ్వర్యంలో దివ్యజీవన సత్సంగ సమావేశం ఆదివారం నిర్వహించారు. పాలకొండకు చెందిన సత్యసాయి సేవా సంస్థల ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సేవా భావం అలవర్చుకోవాలని తెలిపారు. అలాగే అందరూ భగవద్గీతను చదవాలని, భగవంతుడిని ధ్యానించడం ద్వారానే మోక్షం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్ భాస్కరనాయుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి యూబీఏ తోడ్పాటు

రాజాం సిటీ: గ్రామాల అభివృద్ధికి ఉన్నత భారత్ అభియాన్(యూబీఏ) తోడ్పాటునందిస్తుందని జీఎంఆర్ ఐటీ విద్యార్థులు అన్నారు. మండలంలోని గుయ్యానవలస, రామనుజులపేట గ్రామాల్లో ఇంటింటా సర్వే ఆదివారం నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై, యూబీఏ ముఖ్య ఉద్దేశ్యం వివరించారు. గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు.

పారిశుధ్య పనులు

రాజాం: మండలంలోని కంచరాం, ఆగూరు గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన పారిశుధ్య పనులను ఎంపీడీవో వి.శ్రీనివాసరావు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంగా పంచాయతీల అభివృద్ధిపై దృష్టి సారించాలని తెలిపారు. గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ బాగుండాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కోనారి అనూష, గెద్దాపు అప్పలనాయుడు పాల్గొన్నారు.

అన్నదానం

రేగిడి: మండలంలోని వావిలవలస శ్రీరామ ధర్మక్షేత్రంలో అన్నదాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రామానికి చెందిన చిరువ్యాపారి వారణాసి జగన్నాథస్వామి ఈ కార్యక్రమం చేయగా, ఆయన తన సంపాదనలో కొంత మొత్తాన్ని నిరుపేదల నిత్యాన్నదానానికి వినియోగిస్తుండడం అభినందనీయం.

తప్పిన ముప్పు



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రాజాం సిటీ: స్థానిక చీపురుపల్లి రోడ్డులోని మందుగుండు సామగ్రి దుకాణానికి సమీపంలో ఆదివారం ఉదయం మంటలు చెలరేగాయి. ఎవరో ఆకతాయిలు అక్కడి రెల్లిగడ్డికి నిప్పంటించడంతో ఒక్కసారిగా మంటలు రావడంతో స్థానికులు ఆందోళన చెందారు. వెంటనే అప్రమత్తమై ఫైర్ స్టేషన్‌కు సమాచారమిచ్చి, సంఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేయడంతో ముప్పు తప్పింది. అదే సమయంలో గాలి వీచి మందుగుండు సామగ్రి వైపు మంటలు వస్తే పెనుప్రమాదమే సంభవించేదని స్థానికులు అంటున్నారు. ఏదిఏమైనా సంబంధిత షాపుల యజమానులు నిబంధనలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు.

వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

వంగర: మండల కేంద్రం సహా మగ్గూరు, మడ్డువలస గ్రామాల వద్ద పోలీసులు ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ షేక్ శంకర్ తన సిబ్బందితో కలిసి రోడ్డుకు ఇరువైపులా వచ్చే వాహనదారులను ఆపి, వాహన ధ్రువపత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్‌లను పరిశీలించారు. ఎటువంటి ధ్రువపత్రాలు లేని వారికి అపరాధ రుసుం విధించారు. వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హరిత దీపావళి జరుపుకోండి



మట్టి ప్రమిదల్లో దీపాలు వెలిగించి, అవగాహన కల్పిస్తున్న గ్రీన్‌బెల్ట్ సొసైటీ సభ్యులు

బొబ్బిలి: గ్రామీణ ప్రాంతాలు, పట్టణాలు, నగరాల్లో అందరూ హరిత దీపావళి జరుపుకోవాలని గ్రీన్‌బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి కోరారు. ఈ నెల 31వ తేదీన దీపావళి పండగ పురస్కరించుకుని, మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం హరిత దీపావళిపై అవగాహన కల్పించారు. పర్యావరణాన్ని కలుషితం చేసే టపాసులు కాల్చకుండా మట్టి ప్రమిదల్లో దీపాలు వెలిగించి, దీపావళి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కె.కృష్ణదాస్, మున్సిపల్ కౌన్సిలర్ మరిపి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సేవలు విస్తరిస్తాం

రాజాం సిటీ: మండలంలో మానవతా సేవా సంస్థ సేవలు విస్తరిస్తామని ఆ సంస్థ అధ్యక్షుడు బీవీ అచ్యుత్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఆ సంస్థ కార్యాలయంలో ఇటీవల మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా రైతునేస్తం అవార్డు పొందిన పెంకి గౌరీశ్వరరావును ఆదివారం సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు మరిన్ని సలహాలు అందించి, సేంద్రియ వ్యవసాయంపై మక్కువ పెంచాలని కోరారు. అలాగే సంస్థ ద్వారా చేపట్టనున్న కార్యకలాపాలను వివరించారు. సమసమాజ సేవే లక్ష్యంగా కృషి చేయాలని కోరారు. మొక్కలు నాటడం, పేదలను ఆదుకోవడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. కార్యక్రమంలో చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, కార్యదర్శి ఉల్లాకుల నీలకంతేశ్వరయాదవ్, పెంకి చైతన్య పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ మీటరు



రాజాం: పట్టణంలోని డోలపేట ప్రధాన రోడ్డును ఆనుకుని ఉన్న విద్యుత్‌స్తంభానికి అమర్చిన విద్యుత్ మీటరు ప్రమాదకరంగా కనిపిస్తోంది. మీటరుకు రక్షణగా పైన ఉండే బాక్సు లేకపోవడంతో పాటు అది చిన్నారులకు అందినంత ఎత్తులోనే ఉండడంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని చుట్టుపక్కల వారు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, ఈ విద్యుత్ మీటర్‌ను ఎత్తులో ఏర్పాటు చేసి, సేఫ్టీ డోర్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

108 వాహన ఉద్యోగుల నిరసన



తెర్లాం పీహెచ్‌సీ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి, విధులకు హాజరైన 108 వాహన ఉద్యోగులు



బొబ్బిలిలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న 108 ఉద్యోగులు

తెర్లాం: రాష్ట్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా 108 వాహన(అంబులెన్స్) ఉద్యోగులు ఆదివారం నిరసన చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేంత వరకు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతామని తెర్లాం పీహెచ్‌సీ పరిధిలోని 108 వాహన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు, పైలట్లు స్పష్టం చేశారు. ఏపీ 108 సర్వీసు కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ పిలుపు మేరకు మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఎదుట 108 వాహన ఉద్యోగులు ఆదివారం నల్లబ్యాడ్జీలు ధరించి, విధులకు హాజరై, నిరసన వ్యక్తం చేశారు. స్థానిక 108 వాహనం ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు బోను వెంకటరమణ, పిల్లి రమణ, పైలట్లు అమరా రాజేష్, పుప్పాల గౌరీశంకరరావు, బి.అప్పారావులు మాట్లాడుతూ తమలాంటి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ యూనియన్ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వానికి, 108 సర్వీసుల యాజమాన్యానికి నోటీసులు అందజేసి, చర్చలు జరిపారన్నారు. అయితే పలు ప్రధాన సమస్యలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి గానీ యాజమాన్యం నుంచి గానీ సానుకూల హామీ రాలేదన్నారు. ఈ నేపథ్యంలో నవంబరు 8వ తేదీ వరకు తామంతా నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు కావాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని కోరారు.

బొబ్బిలి: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని 108 వాహన ఉద్యోగుల యూనియన్ నాయకులు వి.అప్పలనాయుడు, బి.వెంకటరమణలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు వారంతా నల్లబ్యాడ్జీలు ధరించి, విధులకు హాజరయ్యారు. నవంబరు 8వ తేదీ వరకు తమ నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

ఘనంగా నందెన్న నిమజ్జనోత్సవం



నందెన్న విగ్రహ ఊరేగింపు

రామభద్రపురం: మండల కేంద్రంలోని కర్ణి వీధిలో నిర్వహిస్తున్న నందెన్న ఉత్సవాలు ముగిశాయి. ఆదివారం సాయంత్రం నందెన్న సహా గౌరీపరమేశ్వరుల విగ్రహాల నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. తప్పెటగుల్లు, బిందెల డ్యాన్సు, కోలాటం, కోయ డ్యాన్సు, కాళికాశక్తి వేషధారణల ప్రదర్శన వంటి సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగింపు అట్టహాసంగా జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు చేరుకుని, స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఊరేగింపులో డీజే పాటలకు యువతీయువకులు చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

బాడంగి: మండలంలోని డొంకినవలస, తెంటువలస, గజరాయునివలస, గొల్లాది, ముగడ, పాల్తేరు, వాడాడ, రేజేరు, కోటిపల్లి, ఆనవరం తదితర గ్రామాల్లో నందెన్న సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. రామచంద్రాపురంలో నందెన్నను వారం రోజుల పాటు పూజలు చేసి, నిమజ్జనం చేశారు. గజరాయునివలస, డొంకినవలస గ్రామాల్లో నాగులచవితి రోజున నందెన్న నిమజ్జనోత్సవం చేస్తారు. ముగడలో అయితే కార్తీకమాస పౌర్ణమి వరకు పూజలు చేసి, అనుపోత్సవం నిర్వహిస్తారు.

యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి



శిక్షణార్థుల జెర్సీ ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: యువత తమకు అందివచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని, ఉన్నత స్థాయికి ఎదగాలని మాజీ ఐపీఎస్ అధికారి జీహెచ్‌పీ రాజు ఆకాంక్షించారు. మండలంలోని కంచరాం గ్రామ సమీపంలోని తృప్తి రిసార్ట్‌లో లోలుగు సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 200 మంది పోలీస్, ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ శిక్షణార్థులకు రూ.4 లక్షల విలువైన ట్రైనీ దుస్తులు ఆదివారం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి ఐఏఎస్ వరకు విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో లోలుగు సుశీలమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు లోలుగు మదన్ కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రియర్ అడ్మిరల్ ఆర్.శ్రీనివాసరావు, కల్నల్ విజయ్‌బలరాం, డాక్టర్ ఏనుగుల చైతన్యమురళి, జీఎంఆర్ ఐటీ ఎడ్యుకేషనల్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ ఎస్‌వీ ప్రసాద్, ట్రైనర్స్ శ్యామలరావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

బొబ్బిలి: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా స్థానిక పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పోలీస్ అమరవీరుల త్యాగాలు కొనియాడుతూ ఆనందోబ్రహ్మ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు ఆదివారం నృత్యాలు చేశారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను గుర్తు చేస్తూ ఆలపించిన గీతాలకు వేసిన డ్యాన్స్ చూపరులను ఆద్యంతం ఆకట్టుకుంది. శాంతిభద్రతలు కాపాడే ప్రయత్నంలో అసువులు బాసిన పోలీసుల త్యాగాలు మరువలేనివని, వారిని స్మరించుకోవడమే మనం వారికి ఇచ్చే నిజమైన నివాళి అని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో గంగాధర్, ఎం. విజయమోహనరావు, మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కిరణ్‌కుమార్, డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐ కె.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



వనభోజన కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

రాజాం: పల్లెలు పట్టణ జీవనాన్ని అలవర్చుకోవాలని బౌద్ధమార్గ్ లైవ్‌లీ హుడ్ ఫౌండేషన్ పీడీ గొర్లె శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పట్టణ పరిధిలోని వస్త్రపురికాలనీ సమీపంలో ఉన్న మామిడితోటలో పలు గ్రామాలకు చెందిన ప్రజలతో కలిసి వనభోజన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణాల్లో ఉన్న మౌలిక సదుపాయాలను గ్రామీణ ప్రజలకు వివరించడం, వాటిని గ్రామాల్లో ఏర్పాటు అయ్యేలా బౌద్ధమార్గ్ లైవ్‌లీ హుడ్ కృషి చేస్తోందన్నారు. 500 కుటుంబాలను కమ్యూనిటీ మిత్రులుగా నియమించి, పలు గ్రామాల్లో పబ్లిక్ హెల్త్ డెస్క్ ఏర్పాటు చేసి సేవలందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ పీఎస్ఎం వరదరాజులు, నాగయ్య, పీఐవో రవితేజ, ఎఫ్‌పీఈవోలు సురేష్ తదితరులు పాల్గొన్నారు.